క్లుప్తంగా

ప్రశాంతంగా పరీక్ష

మణుగూరుటౌన్: పది పూర్తయిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. కేంద్రాల్లోకి విద్యార్థులకు హాల్‌టికెట్లు తనిఖీ చేసి పంపించారు. మండలంలోని మూడు కేంద్రాల్లో 618 మంది పరీక్షకు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరయ్యారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

ఖాతా నుంచి రూ.3.65 లక్షలు మాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఎంపీ కాలనీకి చెందిన ఉప్పు రేణుక తన బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయమైన ఘటనపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 29న వాట్సప్‌కు వచ్చిన కోడ్‌పై క్లిక్ చేయగా, వాట్సప్ మొరాయించింది. ఆతర్వాత ఆమె పెళ్లి ఉండడంతో పట్టించుకోకపోగా, ఈనెల 5న ఖాతాలో పరిశీలిస్తే పలు దఫాలుగా రూ.3,65,390 డబ్బులు ఇతరులకు ఖాతాకు బదిలీ అయ్యాయని గుర్తించింది. దీంతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ.2,53,339 నగదు హోల్డ్ పెట్టారు. ఈ విషయమై మంగళవారం రేణుక స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆంజనేయుడికి పూజలు



ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పొదెం వీరయ్య, తదితరులు

బూర్గంపాడు: మండల పరిధిలోని మణుగూరు క్రాస్‌రోడ్‌కు సమీపంలోని అటవీప్రాంతంలో ఇటీవల వెలిసిన ఆంజనేయ విగ్రహం వద్ద రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అటవీప్రాంతంలో స్వయంగా వెలిసిన ఆంజనేయ విగ్రహాన్ని భక్తులు పెద్దసంఖ్యలో సందర్శించి పూజలు చేస్తున్నారు. క్రమంలో పొదెం వీరయ్య మంగళవారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

భద్రాచలంఅర్బన్: ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందిన భద్రాచలం డివిజన్‌కు చెందిన ఈసం జ్యోతిర్మయను మంగళవారం బండారు చందర్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యుడు పి.రాజశేఖర్ పాల్గొని జ్యోతిర్మయిని శాలువాతో సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు రామ్మోహన్ రావు, కేఎస్‌ఎల్‌వీ ప్రసాద్, రాజబాబు, ట్రస్ట్ నిర్వాహకులు బండారు శరత్‌బాబు, ట్రస్ట్ సభ్యులు వైవి.రామారావు, రమేష్, ఎం.లీలావతి, జీవన జ్యోతి, బీబీజీ తిలక్, తదితరులు పాల్గొన్నారు.

31న ఐటీడీఏ ముట్టడి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో జీఓ నం.3ను పునరుద్ధరించాలని కోరుతూ.. ఈనెల 31వ తేదీన నిర్వహించే భద్రాచలం ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ కోరారు. ఐటీడీఏ ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఆదివాసీ విద్యార్థి జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు ఇరప ప్రకాష్ దొర, పూనెం వరప్రసాద్ దొర, వంక వరాలబాబు, గడ్డం వెంకన్నబాబు, వెంకటేష్, నరేష్, కాక సురేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: వేసవి, అధిక ఎండలను నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ అభిమానులు ఎండి.ముర్తుజా, ఎస్.రెహ్మత్ ఆధ్వర్యంలో కూలింగ్ వాటర్‌తో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని అశ్వారావుపేట మాజీ ఉప సర్పంచ్ రేమళ్ల కేదార్ నాథ్ మంగళవారం ప్రారంభించారు.

సమ్మెపై సమావేశం

మణుగూరురూరల్: కార్మిక సమస్యలను, డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వెలగపల్లిజాన్, జి వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, జి.శ్రీనివాస్, మధుసూధన్‌రెడ్డి, మంగీలాల్, నాగెల్లి వెంకట్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను నేర్చుకోవాలి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు విద్యతోపాటు ఇతర నైపుణ్యాలను నేర్చుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఇక్కి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిశోర్ ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీన్ ప్రారంభించి మాట్లాడారు. సిబ్బంది డాక్టర్ రాంప్రసాద్, కె.కోటేశ్వరరావు, డాక్టర్ ఐ.కృష్ణతేజ, డాక్టర్ ఆర్ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మూటల మాటున మెడికల్ వేస్ట్

- అమలుకాని వ్యర్థాల విభజన
- మూటలు కట్టి డంపింగ్ యార్డులకు తరలిస్తున్న ఆస్పత్రులు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు



భద్రాచలం కరకట్ట ప్రాంతంలోని డంపింగ్ యార్డులో పడేసిన ఆస్పత్రి వ్యర్థాలు..



భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో బయో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా బయో వ్యర్థాల తరలింపు కొనసాగుతోంది. జిల్లాలో ఓ ఏజెన్సీ మాత్రమే ఆస్పత్రుల నుంచి వీటిని సేకరిస్తోంది. ఇష్టారాజ్యంగా వీటిని తీసుకెళ్తుండటం, ఆస్పత్రి నిర్వాహకులు పట్టించుకోపోవడంతో ఈ నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పలు ఆస్పత్రి ప్రాంగణాల్లోనే బయో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. సూదులు, సిరంజీలు, సర్జికల్ గ్లవ్స్, సెలైన్ బాటిళ్లు, యూరిన్ బాటిళ్లు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో ఇవన్నీ కొట్టుమిట్టాడుతుండగా.. పెద్ద ఎత్తున రోగాలు తలెత్తే అవకాశాలున్నాయి.

వేరు చేయకుండానే..

ఆస్పత్రుల నుంచి నిత్యం విధిగా బయో వ్యర్థాలను సేకరించాలి. నాలుగు డబ్బాల్లో వీటిని పారేయాలి. పసుపు రంగు డబ్బాలో శరీర అవయవ భాగాలు, డ్రెస్సింగ్ వ్యర్థాలు, దూది, గర్భాశయం, అపెండిక్స్‌కు సంబంధించిన కంతులను ఉంచాలి. ఎరుపు డబ్బాలో సిరంజీలు, గ్లవ్స్, ప్లాస్టిక్ వ్యర్థాలను ఉంచాలి. నీలం డబ్బాలో గాజు వ్యర్థాలు, లోహ పరికరాలు వేయాలి. నలుపు డబ్బాలో ప్రమాదకర ఇతర వ్యర్థాలను వేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇవేవీ అమలు కావడంలేదు. చికిత్స కోసం వచ్చే పేషెంట్లు ఈ వ్యర్థాలతో వ్యాపించే బాక్టీరియా, వైరస్ బారిన పడి కొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

రూ.లక్షలు ఖర్చు చేసినా..

అటు ప్రైవేట్, ఇటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓ ఏజెన్సీ బయో వ్యర్థాల నిర్వహణ పేరుతో ఒక్కో పడకకు రూ.8లు వరకు వసూలు చేస్తోంది. ఏటా ఈ ఆస్పత్రులు రూ.లక్షల్లో ఏజెన్సీకి చెల్లిస్తున్నా ఆశించిన ప్రయోజనం నెరవేరడంలేదు. కొన్ని చోట్ల ఆస్పత్రుల నిర్వాహకులతో ఏజెన్సీ వారు కుమ్మక్కైనట్లు ఆరోపణలున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించిన వారు మూడు రోజులకోసారి కూడా వ్యర్థాలను తరలించడం లేదు.

డంపింగ్ యార్డుకు మెడికల్ వ్యర్థాలు!

భద్రాచలంలో అధికారికంగా 12 ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా, ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లతో కలిపి మొత్తం 40 ఆస్పత్రులు ఉన్నట్లు సమాచారం. వీటి నుంచి వచ్చే వర్థాలను సంబంధిత ఏజెన్సీ ద్వారా రోజూ తరలించాల్సి ఉంటుంది. కాని అందుకు ఖర్చు ఎక్కువగా ఉండటంతో కొన్ని ఆస్పత్రుల నిర్వాహకులు వక్రమార్గాన్ని ఎంచుకుంటున్నారు. రోజూ కుప్పలుగా చేరుతున్న వ్యార్థాలను ఆస్పత్రుల్లో మూటలు కట్టి.. వాటిని ప్రైవేట్ వాహనాల్లో భద్రాచలం కరకట్ట వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడున్న చెత్తలో కలిపేస్తున్నారు. ఇటువంటి ఘటనలు గతంలో అనేక మార్లు జరగడం, అధికారులు జరిమానాలు విధించడం తెలిసిందే. అయినా వీరిలో మార్పులేదు.

పలుమార్లు జరిమానా విధించాం..



గతంలో డంపింగ్ యార్డులో పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన వ్యర్థాలు డంపింగ్ యార్డులో వేసిన సమయంలో ఫైన్లు వేశాం. ఆస్పత్రుల నిర్వహకులతో సమావేశాం నిర్వహించి, హెచ్చరించాం. మరోమారు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహకులతో సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ అధికారి, భద్రాచలం

నిబంధనలు అతిక్రమించొద్దు



ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహకులు తప్పని సరిగా వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు పాటించాలి. ఆస్పత్రులకు సంబంధించిన వ్యర్థాలు తప్పని సరిగా బయోవేస్ట్ కలెక్ట్ చేసే ఏజెన్సీకి అందజేయాలి. ముందుగా ఆ వేస్ట్‌ను వేరు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఆస్పత్రి నిర్వాహకులదే. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డా.చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, భద్రాచలం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ



ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

భద్రాచలంఅర్బన్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ మొహమ్మద్ ఫయాజుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్ బృందం పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి ఆరోగ్య సేవలు నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఇతర పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.చైతన్య మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ధరల పట్టిక బోర్డులను ప్రదర్శించాలని, ఆస్పత్రి వ్యర్థాలను నిబంధనల ప్రకారం, శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించాలని అన్నారు. నిబంధనల ప్రకారం లేని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నృసింహ రథోత్సవం



రథం లాగుతున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనృసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మగంళవారం రాత్రి స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. ముందుగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ కనులపండువగా ఈ వేడుక సాగగా.. ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువత లబ్ధి పొందాలి

భద్రాచలంటౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ గిరిజన యువతలో అర్హులందరికీ రుణాలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. మంగళవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. పథకానికి జిల్లాలో 21,792 మంది గిరిజన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. మండలాల్లో చేపట్టే దరఖాస్తుల పరిశీలనకు ఐటీడీఏ అధికారులు హాజరై క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

అనీమియా పరీక్షలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో, ఆమ్ సెంటర్‌లలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పలువురికి మంగళవారం సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి పరీక్షలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, సుమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలని ధర్నా



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

చర్ల: చర్ల మండలంలో ఇళ్లు లేక పూరిళ్లు, టార్పాలిన్ల చాటున నివసిస్తున్న పేదలకు మొదటి ప్రాధాన్యతలో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో చర్లలో ధర్నా చేపట్టారు. చర్లలోని బీఎస్ రామయ్యభవన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడారు. అనర్హులకు స్థానం కల్పించి అర్హులను ఇందిరమ్మ ఇళ్లకు దూరం చేశారని యన ఆరోపించారు. నాయకులు హరినాగవర్మ, బాలాజీ, వరలక్ష్మి, సమ్మక్క, నారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో తాగునీటి సమస్య



పని చేయని చేతిపంపు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో మల్లెలమడుగు-1 అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చేతిపంపు పని చేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రం పక్కనే వాటర్ ట్యాంక్ ఉంది. మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు ఆ ట్యాంక్ ద్వారానే గ్రామంలో కొంత భాగం ఇంటింటికి సరఫరా చేస్తారు. కానీ అంగన్‌వాడీ కేంద్రానికి ఆ నీరు అందడం లేదు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, అధికారులు స్పందించి చేతి పంపుకు మరమ్మతులు చేపట్టాలని అంగన్‌వాడీ కేంద్రానికి మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్ ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్, స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

అశ్వాపురం: మండలంలోని పాములపల్లి గ్రామానికి చెందిన, భద్రాచలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థిని కనిపించకుండాపోయిన ఘటనపై మంగళవారం ఎస్ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేశారు. ఈ నెల 5న విద్యార్థిని కాలేజికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.అందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పల గ్రామానికి చెందిన గిద్దె కృష్ణ అనే గ్రామీణ వైద్యుడు సోమవారం మర్కోడ్ గ్రామం నుంచి తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోతె గ్రామ శివారున చేరుకోగానే ప్రధాన రహదారిపై అకస్మాత్తుగా గేదె అడ్డురావడంతో అదుపుతప్పి ఒక్కసారిగా కిందపడ్డాడు. దీంతో కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా క్షతగాత్రుడిని కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సాగులో మెళకువలు పాటించాలి



దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ హేమంత్‌కుమార్

దమ్మపేట: పంటల సాగులో మెళకువలు, నూతన సస్యరక్షణ పద్ధతులను పాటించి తద్వారా నీరు, కూలీల ఖర్చు ఆదా చేసుకుని పెట్టుబడిని గణనీయంగా తగ్గించుకోవచ్చని, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ హేమంత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగుకు పచ్చిరొట్టను వినియోగించాలని, అదనపు ఆదాయం పొందే మునగ పంటపై దృష్టి సారించాలని అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించి, తద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, తద్వారా నష్ట పరిహారం పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు జాంబమ్మ, శిరీష, హెచ్‌ఓ సందీప్, ఏఓ చంద్రశేఖర రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: రసాయనిక ఎరువుల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకుని, నేలతల్లి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగాంజలి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ పి.ఝాన్సీరాణి, ఏఓ కె.శివరాం ప్రసాద్, హెచ్‌ఓ బి.వేణు మాధవ్, డాక్టర్ జి.వినయ్‌కుమార్, వ్యవసాయ విద్యార్థులు నాగలక్ష్మి, వరప్రసాద్, విజయ్, మహేష్, శివ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

యువ వికాసానికి స్క్రూటినీ పూర్తి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మణుగూరురూరల్: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను గ్రామస్థాయిలో ప్రాథమిక స్క్రూటినీ చేసినట్లు, సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తులను సంబంధిత అన్ని బ్యాంకులకు పంపించాల్సి ఉన్నట్లు మణుగూరు ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఎంపిక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సమావేశానికి కొత్తగూడెం ఎల్‌డీఎం వి.రామిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సత్యప్రకాష్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఓ నుంచి ఏపీఎం అహ్మదుల్లా, ఏఓ రాహుల్‌రెడ్డి, పశువైద్యాధికారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కూపన్లు రద్దు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): నేటి నుంచి మండలంలో ఇసుక కూపన్లు, మట్టి అనుమతులు రద్దు చేసినట్లు తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్న వారు మైనింగ్‌శాఖ అనుమతులు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మట్టి అవసరం కొద్ది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు ఇస్తామని తహసీల్దార్ తెలిపారు. అక్రమంగా ఇసుక, మట్టి తోలకాలు చేసే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక లారీలు అడ్డగింత



నిలిచిన బొగ్గు, ఇసుక లారీలు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలోని రాజుపేట మూలమలుపు వద్ద ఓ వ్యక్తిని ఇసుక లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఏటూరునాగారానికి చెందిన ఓ వ్యక్తి మోటార్‌సైకిల్‌పై రాజుపేట వైపు వస్తున్న క్రమంలో పద్మగూడెం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ మూల మలుపు వద్ద ఢీకొట్టింది. అయినా డ్రైవర్ లారీ ఆపకుండా వెళ్లిపోయాడు. లారీల వేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రాజుపేట వాసులు ఇసుక, బొగ్గులారీలను అడ్డుకున్నారు.

'పర్సనల్' అధికారులతో సమీక్ష

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్‌లోని సంక్షేమ విభాగం సేవలు బాధ్యతాయుతమైనవని డీజీఎం (పర్సనల్) రమేశ్ అన్నారు. మంగళవారం పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లకు సంబంధించిన సంక్షేమ అధికారులు, పీఓఏలు, ఆయా డిపార్ట్‌మెంట్ స్టాఫ్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాడర్ స్కీం ప్రమోషన్స్, ఉద్యోగుల పదవి విరమణ బెనిఫిట్స్, కోర్టు కేసుల పురోగతి, చార్జిషీట్‌ల విచారణ, కారుణ్య నియామకాల, మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అవగాహన తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పర్సనల్ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్యానికి దరఖాస్తు

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దబండిరేవు గ్రామంలోని పోతురాజు స్వామి దేవాలయానికి ధూప దీప నైవేద్యం కోసం తెలంగాణ దేవాదాయ ధర్మదాయశాఖకు గిరిజన పూజారి పూనెం వెంకటేష్ దరఖాస్తు చేసుకున్నారు. మహాత్మాజ్యోతి బాపులే ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో అధికారులకు దరఖాస్తు అందజేశారు. ఆయన వెంట మండల టీటీడీ ప్రచారక్ పిలక నాగేంద్రరెడ్డి ఉన్నారు.

బియ్యం, నగదు వితరణ

అశ్వాపురం: శివామేశ్వరి గ్రూప్స్(ఎస్‌కేటీ) డైరెక్టర్ దోసపాటి రాము జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని మంచికంటినగర్‌లోని అరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం 25 కేజీల బియ్యం, నగదు వితరణగా అందజేశారు. ఎస్‌కేటీ గ్రూప్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గుండాల: ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులపై దాడులు చేస్తున్నారని, తక్షణమే కగార్‌ను నిలిపివేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రజానీకాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్నారని విమర్శించారు. సమావేశంలో గోల్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- ఇష్టారీతిగా డివైడర్ నిర్మాణ పనులు
- పర్యవేక్షణ వదిలేసిన ఉద్యోగులు



మందలపల్లిలో పర్యవేక్షణ లేకుండా కొనసాగుతున్న డివైడర్ నిర్మాణ పనులు



అస్తవ్యస్తంగా డివైడర్ నిర్మాణం..

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట నుంచి మందలపల్లి వరకు నిర్మిస్తున్న సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరువైంది. గతంలో బీఆర్ఎస్ హయాంలో దమ్మపేటకు సెంట్రల్ లైటింగ్, డివైడర్(మూడు అడుగుల ఎత్తు) మంజూరు కాగా వాటి నిర్మాణ పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గత కొద్ది నెలల కిందట ప్రారంభించారు. ఈ పనుల్లో నాణ్యత లోపించడం స్థానికుల నుంచి బలంగా వినిపిస్తున్న విమర్శ.

కొరవడిన పర్యవేక్షణ..

మండలంలోని మందలపల్లి నుంచి దమ్మపేట వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులే చేపడుతున్నారు. ముందుగా సెంట్రల్ లైటింగ్ పనుల నిమిత్తం అడుగు ఎత్తులోనున్న డివైడర్ మధ్యలో కాంక్రీట్ దిమ్మెల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ పనులను పర్యవేక్షించడానికి సంబంధిత ఎలక్ట్రికల్ ఏఈ, అతడి బాధ్యులు ఉండాల్సి ఉంది. కానీ ఆ పనుల పర్యవేక్షణను పట్టించుకున్న నాథుడు లేదు. దీంతో కాంక్రీట్ దిమ్మెలకు వినియోగించిన కాంక్రీట్ మిశ్రమంలో నిర్ణీత మొత్తంలో ఇసుక, కంకర, సిమెంట్‌లను కలిపారా లేదా అనేది ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది. సెంట్రల్ లైటింగ్ దిమ్మెల నిర్మాణం అనంతరం డివైడర్ ఎత్తును పెంచుతూ నిర్మాణ పనులను చేపట్టారు. మందలపల్లి నుంచి ప్రారంభించిన డివైడర్ నిర్మాణ పనుల్లో ఇసుక, సిమెంటును అతి తక్కువ మొత్తంలో వినియోగించి, ఎక్కువ మొత్తంలో ఫ్లైయాష్‌ను ఉపయోగించారు. ఇలా నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు వదులుతూ కొద్ది మీటర్ల మేర ఇదే రీతిలో నిర్మాణ పనులను కొనసాగించారు. ప్రస్తుతం ఒక అడుగు ఎత్తులో ఉన్న డివైడర్‌పై నునుపుతలాన్ని చిప్పింగ్ (గరుకుతనం) చేసిన అనంతరం దానిపై గ్రానైట్ రాయితో నిర్మాణం చేయాల్సి ఉండగా.. అలా చేయకుండానే రాయితో నిర్మాణం చేపట్టారు. ఈ కారణంగా ఆ డివైడర్ ఎత్తును పెంచినప్పటికీ, దాని సామర్థ్యం ఎంత మేరకు ఉంటుందో తెలియని పరిస్థితి.

స్థానికుల అభ్యంతరం

డివైడర్ పనుల నిర్మాణంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణానికి తగిన మోతాదులో ఇసుక, సిమెంటును వాడకుండా కేవలం ఫ్లైయాష్‌ను అధిక మొత్తంలో వినియోగించారని, మండలంలోని మందలపల్లి వాసులు నిర్మాణ ప్రదేశంలోనే కొద్ది రోజుల కిందట ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని స్థానికులు సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. మందలపల్లిలో జరుగుతున్న డివైడర్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడితే సహించేది లేదని అన్నారు. అయినప్పటికీ గుత్తేదారుల తీరులో మార్పు కనిపించలేదనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. అధిక మొత్తంలో ఫ్లైయాష్‌తో నిర్మించిన డివైడర్ నిర్మాణమును తొలగించి తిరిగి పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బంది కొరతతోనే..



దమ్మపేటలో జరుగుతున్న డివైడర్ నిర్మాణ పనులను సాధ్యమైనంత మేరకు పర్యవేక్షిస్తూనే ఉన్నాను. నేను దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు ఏఈగా విధులు నిర్వహిస్తున్నాను. దీనితో పని భారం ఎక్కువతో పాటుగా సిబ్బంది కొరత ఉండటం వల్ల పూర్తిస్థాయిలో పర్యవేక్షణ సిబ్బందిని ఉంచలేకపోతున్నాం.

నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదు. ఏమాత్రం తేడా ఉన్న తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఏఈ